పోయిన సొమ్ము

"అబ్బాయ్? ఓరబ్బాయ్! నాయనా ఓర్నాయనా!.... ఇంతలో ఎక్కడికి పోయినాడే?"

"కాకపోయినా, ఒళ్ళు బరువు కాదుటే? పనీ పాటా లేదుకదా! మూడేళ్ళ కుంకను కనిపెట్టుకుని వుండలేకపోతే - నా పోలికే వచ్చివున్నట్టయితే ఈపాటికి ఆరుగురు బిడ్డల తల్లివి కావలసినదానివి! - నీవంటివాళ్ళు సంసారాలేమి ఈదుతారే తల్లీ!"

"అబ్బ! ఒక్కడు చాలెద్దూ. అమ్మా! వేగలేకుండా ఉన్నానూ? ఆ బావి దగ్గిరికే పరిగెత్తాడో - ఏం కర్మమో! రామ రామా! ఒక్క నిమిషం కాలు నిలువదుకదా! ఎక్కడి మైరావణ సంతతో! -"

"చేసుకున్నవారికి.... పో, వెళ్ళి చూడూ! నీకింత ఒళ్ళు బరువయిందేమే? నిన్ను నీ అత్తగారూ, మొగుడూ చెడగొడుతున్నారులేవే!...."

"అడగనక్కరలేదు!" అంటూ సోమమ్మ లేచి సావిడిలోకి వచ్చేటప్పటికల్లా కింది పెదిమలు పయి వరుస పళ్ళతో బిగబట్టి రెండు చేతులూ మండిగం మీద ఆనించి వుపాయంగా గడప దాటుతున్న కృష్ణుడు ప్రత్యక్షమయినాడు.

పిల్లవాడు కనిపించిన సంతోషం రెండు క్షణాలు కూడా వుండలేదు. పిల్లవాడి మొహంలో ఏదో వెల్తి సోమమ్మకు తోచింది. ఏమిటా అది అని ఆలోచనపోయింది. ఈ ఆలోచన కూడా ఎంతో సేపుండలేదు.

ఇంట్లో పొయ్యిమీద ఎసరు ఎక్కించబోతున్న తల్లి ఉలిక్కిపడి చేతుల్లో నించి గిన్నె జారి పడవేసేటంత పెడబొబ్బ పెట్టింది సోమమ్మ- "ఓరి వెధవా గొలుసేదిరా?"

పిల్లవాడి మెళ్ళో వున్న పులిగోరూ, గొలుసూ మంత్రించినట్టు మాయమయినవి.

"ఏం గొలుసే" అంటూ తల్లి కూడా సావిట్లోకి వచ్చింది.

"పులి గోరే! గొలుసే" అంది సోమమ్మ తెల్లమొహం వేసి.

"తలంటి పోసి గొలుసు పెట్టావుటే?"

"అయ్యో-పెట్టానే."

"ఏంరా. నాన్నా? గొలుసేదిరా?'

అమ్మమ్మ చంకకెక్కి కృష్ణుడు "అమ్మ-మ్మ-మ్మ...." అని ప్రారంభించాడు.

"సీల వూడి గొలుసెక్కడయినా జారిపడ్డదేమోనే" అంటూ సోమమ్మ దొడ్డిచుట్టూ తిరిగి వచ్చింది. ఎక్కడా గొలుసు జాడాలేదు. పచ్చగా కనపడ్డదల్లా గడ్డిపరకగానే పరిణమించింది.

"అయ్యయ్యో! పాపిష్టి సొమ్మే!" అంది సోమమ్మ నిలువునా కంపిస్తూ. ఆ పాపిష్టి సొమ్ము కోసం ఆమె పడుతున్న తహ తహ చూస్తే ఎంత మందమతికయినా ఆశ్చర్యం వేస్తుంది.

"వాకిట్లోకి వెళ్ళాడేమో" అంది తల్లి. అనీ అనడంతోటే సోమమ్మ వాకిట్లోకి పరిగెత్తింది. కూతుర్ని అనుసరించింది తల్లి.

వీథిలో "వాళ్ళ" రాముడు ఆడుకుంటున్నాడు.

"ఏంరా. రాముడూ, మా పిల్లవాడు వాకిట్లోకి వచ్చాడా?" అంది సోమమ్మ.

"ఆ వచ్చాడండీ" అన్నాడు కళ్ళు పెద్దవి చేసి. వాడి వాలకం చూస్తే ఈ రహస్యం ఎవరు ముందడుగుతారా చెప్పేద్దామనుకున్నట్టుంది.

ఈ కాస్త ముక్కా చెప్పేసి పెద్ద బరువు తన మీద నించి తీసేసుకున్న వాడల్లే రాముడు రెండు పెదిమలూ లోపలికీ నాలిక బయటికీ పోనిచ్చి బొంగరానికి జాగ్రత్తగా తాడు చుట్టడం మొదలుపెట్టాడు.

"ఎంత సేపయిందిరా-రాముడూ?"

నాలికి లోపలికి పోయింది. పెదిమలు పయికివచ్చినయి, కనుబొమలు పయికి పోయినయి, "ఏమిటండీ?" అన్నాడు.

"మా కిష్టుడు బయటికి వచ్చి ఎంతసేపయింది?"

"ఇప్పుడేనండీ! ఎనిమిది గంటలప్పుడు" మళ్ళా కనుబొమ్మలు యథాస్థానానికి వచ్చేసినయి. కళ్ళ సయిజు కూడా తగ్గిపోయింది. పెదిమలు లోపలికి వెళ్ళినయి. నాలికి బయటికి వచ్చేసింది. బొంగరం విసరివేయడానికి తయారవుతున్నాడు.

అప్పుడు దాదాపు పదకొండు గంటలు కావటం వల్ల రాముడు చెప్పిందంతా సోమమ్మకుగానీ తల్లికిగానీ ఎందుకూ పనికిరాలేదు. తల్లీ కూతురూ మొహా మొహాలు చూసుకున్నారు.

"ఇంతకూ మనకు ప్రాప్తం లేదు! నీకు బుద్ధిలేదులేవే! ఇదేం మీవూరా? ఎక్కడపారవేసిన వస్తువక్కడ వుండడానికి? బస్తీలో పిల్లలకు నగలూ నాణ్యాలూ పెట్టడానికి వుందా? ఇంకా పిల్లవాణ్ని నిలువునా ప్రాణం తియ్యలేదు. బిడ్డయినా దక్కాడని సంతోషించక ఏడుస్తావెందుకు? పద!"

సోమమ్మకు దుఃఖం ఆగలేదు.

"అది పెట్టడం మరిచిపోనన్నా పోలేదే! నా చేతులు కాలిపోనూ! పాపిష్టిసొమ్మే! అయ్యో అయ్యో! ఆరు నవరుసుల సొమ్ము ఎవరి నోట పెట్టానే–"

ఇంతలో తల్లికొక ఆలోచన తట్టింది.

"ఇదుగో–చూడమ్మాయ్! వాడున్నాడే–వాళ్ళ రాముడు – వుత్త పోకిరీ వెధవ! వెనక యిట్లాగే వాళ్ళ నాన్న జేబులోనుంచి అయిదు రూపాయిల కాయితం కూడా యెత్తుకు పోయినాడే! నేను వెంకాయమ్మను మెల్లిగా అడిగి చూస్తానుండు...... వూరుకో అమ్మా – వూరుకో! పిచ్చిదానా ఏడిస్తే వస్తుందిటే?"

"ఇప్పుడడగవే అమ్మా: యిప్పుడే అడగవే!" అంటూ రాగం తీసింది కూతురు.

"ఊః" అని ఒక్క ముక్కు ముక్కి తల్లి లేచి "నాకు మడి బట్టన్నా ఆరలేదు" అంది.

"అయ్యో! అయిదు నవర్సుల బంగారంకన్నా ఎక్కువటే!" అంది కూతురు.

అంతా విని వెంకాయమ్మ అంతెత్తు ఎగిరి పడ్డది.

"చాల్లేవమ్మా! నేర్చుకుపోయినావు. ఓడు ఓడంటే కంచం అంతా ఓడు అన్నారుట. అజ్ఞానపు కుంక తెలియక జేబులోంచి తీస్తే అప్పుడే వాళ్ళనాన్న మెక్కెలు విరగతన్నాడు. ఆరునెలలయింది. మళ్ళీ వాడు కానీ తాకి ఎరగడు. ఓహో–బాగావుందే– ఇటువంటి– చాడీలు మాత్రం తీసుకురాబోకమ్మా! ఏదిపోయినా యిక మావాడి మీదే పెడతారు... చాలా బాగుంది!" అని ఆవిడ యింటి పెంకు లెగరగొట్టేటప్పటికి సోమమ్మ తల్లి దడుచుకుని ఇంట్లో వచ్చి పడ్డది.

ఇంతలోనే సోమమ్మ తండ్రి వచ్చాడు. పెళ్ళామూ కూతురూ ఒక్కసారే మాట్లాడడంలో ఆయన కెంతసేపటికి అర్థంకాలేదు. తీరా అర్థమయిన తర్వాతనయినా ఆయన ఆడవాళ్ళకు ధైర్యం కలిగేటట్టు ప్రవర్తించలేదు. పెదిమలు బిగపట్టి "ఊఁ హూఁ" అన్నాడు. ఇనప పెట్టికేసి తీక్షణంగా చూశాడు. "హూఁ!" అన్నాడు. పెళ్ళానికేసి రీవిగా "ఎవరు నీవు" అన్నట్టు చూసి "ఊఁ – హూ" అన్నాడు; క్రమంగా అంతా బోధపడిపోతున్నట్టు, అకస్మాత్తుగా లేచి బయటికి వెళ్ళాడు.

ఈ చర్య ఆడవాళ్ళ కర్థంకాలేదు. వాళ్ళు ఎక్కువ ఇంప్రెస్ కూడా కాలేదు. అందుకు నిదర్శనంగా సోమమ్మ తల్లి వంటింట్లో నుంచి "మళ్ళీ ఎక్కడికో వెళ్ళారు ఎంతసేపు కనిపెట్టుకు కూచోవాలో!" అంది.

ఒక అరగంటలో సోమమ్మ తండ్రి ఒక పోలీసును తీసుకొచ్చాడు.

"ఏమమ్మా! పోయిన వస్తువెవరిది?" అన్నాడు పోలీసు వచ్చీ రావడముతోనే.

"నాది" అంది సోమమ్మ ఆదుర్దాగా. "ఆఁ... నీ మొహం!... దానిదికాదు దాని పిల్లవాడిది....." అన్నాడు సోమమ్మ తండ్రి.

"అబద్ధాలు చెపితే మేము సొమ్ము పట్టివ్వలేము..... పోయిన నగను కొంచెం వర్ణించండి."

"గొలుసు-నాయనా-పులిగోరూ."

"ఎటువంటి గొలుసు?"

"మామూలు గొలుసే-పులిగోరూ-మామూలు పులిగోరే!"

"అట్లా చెబితే చాలదు. గొలుసెంత తూకం వుంటుంది?"

"ఎనిమిది సవర్లు."

"ఇదుగో అమ్మగారూ-మీకీ సంగతులు తెలియవు. మాతో అబద్ధాలు చెబితే మీ సొమ్ము మీకు దక్కదు. ఎంత తూకం ఉంటుంది?"

"అయితే ఎనిమిది సవర్లని చేయించారు కామల్ను. అరిగిపోయి నాలుగన్నా ఉంటుంది."

"ఎక్కువుంటుందా?"

"ఉండవచ్చు... ఉండదు."

"మూడు సవర్ల ఎత్తు... సరే పులిగోరెంత పొడుగుంటుంది?"

"రెండంగుళాలు."

"ముప్పాతిక అంగుళం... సరే. ఎప్పుడు పోయింది?"

పోలీసు స్టేటుమెంటు తీసుకొని "ఏమండో పంతులుగారూ-సొమ్ము దొరికితే ఏమయినా యీనాం...." అని హెచ్చరించి వెళ్ళిపోతూ ఆయన్ను బయటికి పిలిచి రహస్యంగా "మీ కెవరిమీదయినా అనుమానం ఉందా?" అన్నాడు.

"అడిగావు కాబట్టి చెబుతున్నాను. ఎనిమిదో వార్డు ఎలెక్షన్‌లో నేను లంచాలిచ్చి నెగ్గానని కోర్టులో పిటీషన్ పెట్టి ఓడిపోయిన నాటినుంచి ఆ చలపతిరావు నా మీద కారాలు-మిరియాలూ నూరుతున్నాడు... ఏమిటి వ్రాసుకొంటున్నావు?"

"ఏమి లేదులెండి" అంటూ పోలీసు వెళ్ళిపోయినాడు.

ఆ రోజు సాయంకాలమే దేవుడల్లే వచ్చింది ఒక సోదమ్మి. దాన్ని పిలిచారు. సోమమ్మ పుల్ల పడితే సోది సరిగా రాదని పూర్వానుభవం. అందుచేత తల్లే కూచుంది.

మొదట వెంకటేశ్వరస్వామి వచ్చాడు. ముడుపులూ అవీ చెల్లించుకోడమయిపోయింది. పో పొమ్మన్నది సోమమ్మ తల్లి. అప్పుడు వెంకటేశ్వరస్వామి పోయి యెప్పుడో ఆరు నెల్లు పెరిగి పోయిన సోమమ్మ అప్ప వచ్చింది. సోమమ్మ తల్లి కంగారుపడకుండా "నాకు నువ్వక్కరలేదు," అని చెప్పేసింది. అప్పుడసలు సంగతి వచ్చింది.

"సొమ్మొక చోట; అనుమాన మొకచోటే తల్లీ?" అంది సోదమ్మి.

"ఆఁ అదుగదీ" అంది సోమమ్మతల్లి.

"నీ సొమ్మిటా?-ఇటా-ఇటా అనడుగుతుండవూ? ఇటంటే బొట్టిటంటే గడ్డమే మాయమ్మా!" అని పాడుతూ సోదమ్మి బట్టు పుల్లతో చూపించింది. అసలది గడ్డం చూపించబోతూంటే సోమమ్మ తల్లి బొట్టువేపు చెయ్యిపోనిచ్చింది.

ముసిముసి నవ్వులు నవ్వుతూ కూతురివైపు చూసింది. "వాళ్ళ రాముడే తీసేసి తల్లికిచ్చాడు. సందేహము లేదు."

ఈ ముక్క సోదిలో వచ్చిన సంగతి పొద్దుగూకే లోపల వూరంతా తెలిసి పోయింది. ఆ రాత్రి పన్నెండు కొట్టేవరకున్నూ పక్కింటి పెంకు లెగిరి పడుతూనే ఉన్నయి. సోమమ్మా-తల్లీ వెంకాయమ్మను లెక్కచెయ్యలేదు. వాళ్ళకేమిటో సొమ్ము దొరికినట్టే వుంది. "పుచ్చకాయల దొంగా అంటే బుజాలు తడువుకున్నాడుట! ఏమీ ఎరగని మనిషి తనకెందుకు?"

మర్నాడు పొద్దున సోమమ్మ తండ్రి వీథి అరుగుమీద కూచుని మొహం కడుక్కుంటూ వుండగా ఒక బుడబుక్కలవాడు వచ్చాడు.

"పెశ్న చెబుతాను - దొరా పెశ్న చెబుతను కోరిక ఫలిస్తది."

"ఏం ప్రశ్న చెబుతావు?"

"నీ అనుమాన మేడ వుండదో అదే నిజమయితది దొరా."

"నా అనుమానమెక్కడ?"బుడబుక్కలవాడు సరిగా ఈశాన్యమూలగా చూపించాడు. భేష్! అటే ఉంది. చలపతిరావుగారి ఇల్లు. వాడికొక పాత వస్త్రమిచ్చి - "ఇకలేదు పొమ్మ"ని నచ్చ చెప్పి పంపాడు సోమమ్మ తండ్రి.

పోలీసు చెప్పివుండడు గదా - ఎట్లా తెలిసిందో ఊరంతా తెలిసింది. ఫలానాయన ఫలాని చలపతిరావు తన ఇంటో సొమ్ము ఎత్తుకుపోయినాడని పోలీసులకు రిపోర్టు చేశాడుట అని!

రోజులు గడిచినయి. సొమ్ము సంగతేమీ తేలలేదు. పయిగా సోమమ్మ తల్లిని గురించి ఆడవాళ్ళూ సోమమ్మ తండ్రిని గురించి మొగవాళ్ళూ రకరకాలుగా చెప్పుకొని నవ్వుకుంటున్నారని కూడా స్పష్టమయింది.

ఈ పాప కర్మ ఫలం యిట్లా వుండగా ఇంటో చిన్న వస్తువులు రోజురోజు కొకటీ రెండూ చొప్పున మాయం కావడం మొదలుపెట్టినయి. ఎంత జాగ్రత్తపడ్డా ఏమీ ఫలం లేకపోయింది. అప్పుడే వచ్చిపడుతున్న వేసంకాలము కూడా లెక్కచేయకుండా అంతా యింట్లోనే పడుకుంటూ వచ్చారు -దొంగల భయమునించి.

కాని అంత జాగ్రత్త అనవసరం. ఎందుకంటే యీ దొంగతనాలు ఎవరు చేస్తున్నారో కాని కేవలమూ ఏడిపించడానికే చేస్తున్నారు కాని ధనాశకొద్దీ కాదు. పోయిన వస్తువులన్నీ

చూశారో లేదో చాలా స్వల్ప ధరవే! చిన్న చిన్న గ్లాసులంటే. ఉద్ధరణలంటే - అన్నీ ఇటువంటివే! ఎవరో పగకొద్దీ చేస్తున్నారుకాని మరొకటికాదు.

ఇంతలో ఒకరోజున పూడిక తీస్తామంటూ బావుల్లో పూడిక తీసేవాళ్ళిద్దరు వచ్చారు. "బావిలో చాలా పూడిక ఉంది; కిందటేడు కూడా తీయించలేదు. తీయించండి" అంది సోమమ్మ తల్లి మొగుడితో.

ఆ సందర్భంలో పోయిన సామానంతా - పులిగోరూ- గొలుసుతోసహా దొరకటం తటస్థించింది.

❀ ❀ ❀ ❀ ❀

మూడోయేట అందరి కళ్ళల్లోనూ దుమ్ముకొట్టిన కృష్ణుడు పెద్దయిన తర్వాత మాంచి గజదొంగగా తయారయినా ఆశ్చర్యంలేదు.

మొదటి ముద్రణ: వినోదిని, జూలై 1935